

దాదాపు యాబై రోజుల పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఓ 85 ఏండ్ల వయసున్న వ్యక్తి ఆసు పత్రి నుండి డిశ్చార్జీ అయిన మరుసటి రోజే జరిగిన మే డే వేడుకలకు హాజరై లేని శక్తిని కూడదీసుకుని అరుణపతాకాన్ని ఎగురవేసి సగర్వంగా రెడ్ సెల్యూట్ చేస్తే.. కార్మికుల నెత్తుటితో ఎరుపు రంగు అద్దుకున్న ఆ ఎర్ర జెండా మురిసిపోదా..? ఒక పక్క వృద్ధాప్యం వెంటాడుతున్నా, తరగని ఆత్మవిశ్వాసంతో పార్టీ కోసం, ఆరున్నర దశాబ్దాలుగా కార్యకర్తలకోసం ప్రతీ క్షణం ఆరాటపడే మనసు కలిగిన మనిషి కోసం ఆ పార్టీ అక్కున చేర్చుకోదా..? పేద ప్రజలకు బుక్కెడు బువ్వ, నివాసం ఉండటానికి ఇల్లు కావాలని తపన పడే ఆయన పేదల పక్షపాతి గాక మరేంటి..? అందుకే ఆయనను పదవులు వెతుక్కుంటూ వచ్చాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ ప్రస్థానంలో రెండు సార్లు ఎమ్మెల్సీగా, మరో రెండు సార్లు ఎమ్మెల్యేగా తిరుగులేని విజయాలను నమోదు చేసుకున్నారు. వామపక్ష పార్టీ సీపీఐకి పెద్దన్నగా ఉంటూ ప్రపంచ పోకడలపై ఎప్పటికప్పుడు కార్యకర్తలకు తర్ఫీదునిస్తూ కామ్రేడ్లను నిరంతరం చ్కైతన్య పరుస్తుంటారు.. ఆయనే సీపీఐ జాతీయ సమితి సభ్యులు కా.పువ్వాడ నాగేశ్వరరావు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పనిచేస్తూ ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్ తండ్రి. నేడు పువ్వాడ నాగేశ్వరరావు 86వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం...

వనం నాగయ్య/శామ్, సెప్టెంబర్14(కెరటం ప్రత్యేకం)

# ఉద్యమ శిఖరం

## కా.పువ్వాడ నాగేశ్వరరావు

- ఆరున్నర దశాబ్దాల అద్వితీయ రాజకీయ ప్రస్థానం
- ప్రజాపోరాటాలే ఆయన ఎజెండా..
- ఖమ్మం ఖిల్లాపై రెండు సార్లు ఎమ్మెల్యే, మరో రెండు సార్లు ఎమ్మెల్సీగా విజయం
- మూడు పదుల వయసు రాకుండానే పార్టీ పగ్గాలు
- మమత హాస్పిటల్ ద్వారా లక్షలాది మందికి వైద్య సేవలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా వామపక్ష పోరాటాల్లో పువ్వాడ స్థానం పదిలం
- నేడు 86వ ఏడాదిలోకి అడుగుపెడుతున్న పువ్వాడ
- తండ్రి బాటలోనే తనయుడు అజయ్


### మూడు పదుల వయసు రాకుండానే పార్టీ పగ్గాలు..

పువ్వాడ నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానం గురించి ఒక సారి పరిశీలిస్తే..ముఖ్యంగా పువ్వాడ నాగేశ్వరరావు పేరు తెలియని వారు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోనే కాదు రెండు తెలుగు రాష్ట్రాల్లనూ ఉండరంటే అతిశయోక్తి కాదు. ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరిగా, సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు నాయకునిగా, ప్రజా పోరాటాల్లో ముందు వరుసలో నిలిచిన ఆయన ఎక్కడో మారుమూల గిరిజన ప్రాంతం కూనవరంలో చిన్న నర్సింహారావు, రామయమ్మ దంపతులకు 1938 సెప్టెంబరు 14న పువ్వాడ జన్మించారు. విద్యార్థి దశలోనే అత్యంత చురుకుగా ఉండే పువ్వాడ తీరు పలువురిని ఆకట్టుకునేది. స్థానికంగా హైస్కూల్ విద్యను కూనవరంలో పూర్తి చేసిన తర్వాత విజయవాడ





ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో ఉన్నత విద్యను పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయవాద విద్యను పూర్తి చేశారు. ఆ రోజుల్లోనే సీపీఐ అనుబంధ విద్యార్థి సంఘమైన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా, కార్యదర్శిగా పని చేసినకు పార్టీ క్రియాశీల రాజకీయాల్లోకి పంపింది. అనంతరం జరిగిన పలు పోరాటాలకు పువ్వాడ నేతృత్వం వహించడం, ప్రజాపోరాటాలను నిర్మించడంలో శక్తి వంచన లేకుండా కృషిచేయడంతో ఏకంగా 29ఏండ్ల వయసులోనే 1967లో జరిగిన సిపిఐ మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అనేక సందర్భాలలో అనేక పోరాటాలకు పువ్వాడ నాయకత్వం వహించారు. ఖమ్మంజిల్లాలో జరిగిన చారిత్రాత్మక భూ పోరాటాలకు కమ్యూనిస్టు నాయకునిగా పువ్వాడ నేతృత్వం వహించారు. గణేశ్వరం, మల్లెల మడుగు, వినోబానగర్ తదితర పోరాటాలు ఆనాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని వణికించాయి.




**మమత హాస్పిటల్ ద్వారా**

**లక్షలాది మందికి వైద్య సేవలు**

పువ్వాడ నాగేశ్వరరావు తను పార్టీకోసం కృషి చేస్తూనే ఖమ్మం నగరంలో అత్యాధునిక హంగులతో మమత హాస్పిటల్‌ను స్థాపించి లక్షలాది మంది పేద ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు వైద్య సేవలు అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక సందర్భాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కమ్యూనిస్టు ఉద్యమం ఆనాడు చీలిక కారణంగా దెబ్బతిన్న నేపథ్యంలో కా.పువ్వాడ పార్టీకోసం ప్రత్యేకంగా కృషిచేశారు. ఈ క్రమంలోనే కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్, కొమరయ్య, కర్నాటి కృష్ణయ్య, తాళ్లపల్లి రాములు, రావెళ్ల జానకిరామయ్య, తూము ప్రకాష్ రావు లాంటి వారి సూచనలు, సలహాలతో కమ్యూనిస్టు పార్టీని ఒక బలీయ రాజకీయ శక్తిగా తయారు చేశారు. తర్వాత రజబ్ అలీ, టివి చౌదరి, దొండపాటి సహా అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. నిరంతరం ప్రజా ఉద్యమాలను నిర్మించిన సందర్భంలో ఖమ్మంజిల్లాలోని తొమ్మిది స్థానాల్లో నాలుగు స్థానాలను సిపిఐ గెలుచుకుంది.

ఈ నేపథ్యంలోనే పువ్వాడ 1989లో ఖమ్మం నియోజకవర్గానికి జరిగిన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల్లో తనసమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన కే.దుర్గా నర్సింహారావుపై సంచలన విజయం సాధించారు. ఆ నాడు ఎన్నికల్లో పువ్వాడకు సీపీఐ తరపున 61,590 ఓట్లు రాగా, దుర్గా నర్సింహారావుకు 53,495ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో పువ్వాడ 8,095 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అనంతరం 1994లో జరిగిన ఉమ్మడి ఏపీ శాసనసభ ఎన్నికల్లో అదే ఖమ్మం నియోజకవర్గానికి సీపీఐ అభ్యర్థిగా బరిలో దిగిన పువ్వాడ నాగేశ్వరరావు తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన జహీర్ అలీ మహ్మద్ పై ఏకంగా 23,938 ఓట్ల తేడాతో సంచలన విజయం నమోదు చేశారు. నాడు పువ్వాడకు 68,744ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 44,806 ఓట్లు పోలయ్యాయి. ఇలా ఖమ్మం నియోజకవర్గం నుండి రెండు సార్లు ఎమ్మెల్యే శాసనసభలో అడుగుపెట్టారు. దీంతో పాటు 1982, 2004లోనూ రెండు సార్లు శాసనమండలి సభ్యునిగా మండలిలో అడుగుపెట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల పక్షాన తన గళం వినిపించారు.

**రెండు సార్లు ఎమ్మెల్యే,**

**మరో రెండు సార్లు ఎమ్మెల్సీ పదవులు..**

భద్రాచలం ప్రాంతంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సాధారణ ప్రచారకుడిగా ప్రారంభమైన పువ్వాడ నాగేశ్వరరావు జీవితం భద్రాచలం ప్రాంత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ఖమ్మంజిల్లా కార్యదర్శిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా ఉమ్మడి రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంచార్జిగా, అనంతరం ఏకంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుని స్థాయికి ఎదిగారు.





## తండ్రి బాటలోనే తనయుడు..

తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు రాజకీయ ఓనమాలుతో పాలిటిక్స్‌లోకి ఆరంగేట్రం చేసిన ప్రస్తుత రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సైతం ఖమ్మం ఎమ్మెల్యేగా ఇప్పటికే రెండు సార్లు విజయం సాధించి, ముచ్చటగా మూడో గెలుపుకోసం కృషిచేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952 నుండి జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుండి ఏ ఒక్కరూ మంత్రి కాకపోవడం, ఆ రికార్డు ఒక్క పువ్వాడ అజయ్ కుమార్‌కే దక్కడం కొసమెరుపు. అజయ్‌కుమార్ తాను పోటీచేసిన రెండు ఎన్నికల్లోనూ రాజకీయ ఉద్దండులుగా చెప్పుకునే సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై 2014 ఎన్నికల్లో, ప్రస్తుత బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామ నాగేశ్వరరావుపై 2018 శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుండి సంచలన విజయాలు నమోదు చేయడం గమనార్హం.